ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 22 అక్టోబరు 2025

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 32.0
కనిష్ఠం: 24.0





ధూం.. ధాం..

» ఆనందోత్సాహాల మధ్య వేడుకగా దీపావళి పండుగ
» రూ.15 కోట్ల విలువైన బాణసంచా కాల్చిన జిల్లావాసులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆనందోత్సాహాల మధ్య జిల్లావాసులు దీపావళి పండుగను జరుపుకున్నారు. సోమవారం రాత్రి ఆరు గంటల నుంచి మొదలైన బాణసంచా కాల్పులు రాత్రి పదకొండు, పన్నెండు గంటల వరకు ధూం.. ధాంగా మోగుతూనే వున్నాయి. పిల్లలు, పెద్దలు సందడిచేశారు. దీపావళి పండుగ రోజు ఒక్క పశ్చిమ గోదావరిలోనే రూ.15 కోట్ల విలువైన బాణసంచా కాల్చినట్లు అంచనా. గత ఏడాదికంటే ఈసారి తక్కువగానే విక్రయాలు సాగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. గతంలో పాతిక కోట్ల మేర అమ్మకాలు సాగాయి. ఈ సారి లైసెన్సు మంజూరులోనే జాప్యం, బాణ సంచా వ్యాపారుల వద్ద వసూళ్ల దందా అధికమైంది. ఫలితంగా రిటైల్ వ్యాపారులు తగ్గిపోయారు. పట్టణాల్లోనే హోల్‌సేల్‌తోపాటు వర్తకులు రిటైల్ అమ్మకాలు సాగించారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు నరసాపురంలో హోల్‌సేల్ దుకాణాలు నిర్వహించారు. భీమవరం, పాలకొల్లులో చివరి రోజుల్లో దుణాకాలు ఏర్పాటుచేశారు. మరో వైపు వాతావరణం కూడా ఊరిస్తూ వచ్చింది. చాలా మంది కాలుష్యం పేరుతో బాణసంచా వినియోగాన్ని తగ్గించి దీపాలను వెలిగించారు.



మానసిక దివ్యాంగుల మధ్య మంత్రి నిమ్మల దీపావళి వేడుకలు

పాలకొల్లు అర్బన్ : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, భార్య సూర్యకుమారి, కుమార్తె శ్రీజ, అల్లుడు పవన్‌కుమార్‌తో కలిసి పాలకొల్లు అంజలి మానసిక దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులతో కలిసి దీపావళి వేడుకలను జరుపుకున్నారు. మిఠాయిలు పంచి, వారితో కలిసి బాణసంచా కాల్చారు. గోశాలలో ఆవులకు దాణా తినిపించారు మంత్రి నిమ్మల మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు కుటుంబసభ్యులు తమతో లేరన్న విచారం లేకుండా ఉండేందుకు తాము ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే ఎస్సీ, బీసీ వసతి గృహాలకు వెళ్లారు. అంజలి డైరెక్టర్ డీవీడీ ప్రసాదరావు, ధర్మారావు ఫౌండేషన్ సభ్యులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, అప్పారావు, రమాకాంత్, మండెల రాంప్రసాద్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీకం
ముస్తాబైన ఆలయాలు.. పూజలకు సిద్ధం
7


భీమవరం సోమేశ్వరాలయంలో ఏర్పాట్లు


పాలకొల్లు క్షీరారామలింగేశ్వర ఆలయం వద్ద విద్యుత్ దీపకాంతులు



భీమవరంలో డయాలసిస్ సెంటర్‌కు
రూ.75 లక్షలు
వీటితో మూడు రక్తశుద్ధి యంత్రాల ఏర్పాటు

భీమవరం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):భీమవరం పరిసర ప్రాంతాల్లోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు శుభవార్త. భీమవరం ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రధాన మంత్రి జాతీయ డయాలసిస్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా ఏడు డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు వెలువడ్డాయి. అందులో భీమవరం కూడా ఉంది. ప్రతీ కేంద్రంలోను మూడు సెషన్స్ ద్వారా 15 మందికి చొప్పున రక్త శుద్ధి జరిగేలా రూ.75 లక్షలతో మూడు యంత్రాలను ఏర్పాటు చేసారు. ఇప్పటికే జిల్లాలో ఆకివీడులో డయాలసిస్ సెంటర్ పనిచేస్తోంది. త్వరలో ఆచంటలోను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రతిపాదనలో వున్న భీమవరానికి ఇప్పుడు నిధులు కేటాయించారు. త్వరలో మిషన్‌లు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురానున్నారు. కిడ్నీలో సమస్య ఏర్పడి రక్తాన్ని శుద్ధి చేయలేని పరిస్థితి ఏర్పడినప్పుడు శరీరంలో విష పదార్థాలు, అధికనీరు, ఉప్పులాంటి వ్యర్థాలను ప్రమాదకర స్థాయికి చేరతాయి. ఆ సమస్యలో వాటిని తొలగించేందుకు ఈ కృత్రిమ ప్రక్రియను చేపట్టి రక్తాన్ని శుద్ధి చేస్తారు.


పీఎం లంక వద్ద ఎగసిపడుతున్న అలలు

గాలి.. వాన.. చలి

» మారిన వాతావరణం.. సముద్రంలో అలజడి..
» మూడు రోజులపాటు వేట నిషేధం
» బంగాళాఖాతంలో అల్పపీడనం.. వర్షాలు


మొగల్తూరులో ముంపు నీటిని మళ్లిస్తున్న ఎక్స్‌కవేటర్

భీమవరం టౌన్/నరసాపురం/మొగల్తూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ వైపు ఈదురుగాలులు, మరోవైపు భారీ వర్షం.. ఆపై చలిగాలి వీచింది. ఆదివారం వర్షం కురవడంతో దీపావళి పండగ వర్షార్పణమని అంతా అనుకున్నారు. సోమవారం వాతావరణం ప్రశాంతంగా వుండడంతో పండుగను అంతా ఉత్సాహంగా జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం వర్షంతోపాటు ఈదురు గాలులు, చలి గాలులు వీచాయి. రాత్రి వేళల్లో మంచు కురవటంతోపాటు శీతాకాలం చలి ప్రారంభమైంది. ఈదురుగాలులకు నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పీఎం లంక, కేపీ పాలెం, పేరుపాలెం సముద్రం బీచ్‌ల్లో అలలు హోరెత్తించాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో తీరంలో వేటను నిషేధించారు. మూడు రోజులపాటు (మిగతా 8వ పేజీలో)

కరువు భత్యం జీవోలపై
ఉద్యోగుల కన్నెర్ర!

» సీఎం చెప్పిన దానికి విడుదలైన జీవోలకు సంబంధం లేదని సంఘాలు అభ్యంతరం
» జీవోలు 60, 61 సవరించాలని డిమాండ్

నిడమర్రు/ఏలూరు అర్బన్/ఏలూరు రూరల్/పెదవేగి/పెనుమంట్ర, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఒక కరువు భత్యం(డీఏ)ను ప్రకటించింది. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. తీరా విడుదలైన జీవోలు 60, 61లను చూసి కన్నెర్ర చేస్తున్నారు. ఇప్పుడు అమలవుతున్న కరువు భత్యం 33.67%కు అదనంగా ఒక్క డీఏ 3.64% ప్రకటించడంతో ప్రస్తుతం కరువుభత్యం 37.31%గా మారనుంది. ఈ డీఏను 2025 అక్టోబరు నుంచి ఇవ్వనున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. జీవోల ప్రకా రం 1.1.2024 నుంచి 30.9.2025 వరకు రావాల్సిన 21 నెలల డీఏ బకాయిలు బకాయిలను ఉద్యోగి తీసుకోవాలంటే రిటైర్ కావాల్సిందే. ఉద్యోగి రిటైర్‌మెంట్ రోజున డీఏ బకాయిలు చెల్లిస్తామని జీవోల్లో పేర్కొనడంపై ఆయా సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం డీఏ బకాయిల చెల్లింపులో ఖజానా మీద భారం పడకుండా మధ్యేమార్గంగా ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో చెల్లించడం రివాజు. గతంలో రెండు, మూడు దఫాలుగానైనా చెల్లించేవారు. దీనికి భిన్నంగా డీఏ బకాయిలన్నీ ఉద్యోగి చనిపోయిన తర్వాత బెనిఫిట్స్‌తోనో, లేదా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోనే ఇస్తామని చెప్పడం దారుణమని ఉద్యోగ వర్గాలు నిరసిస్తున్నాయి. ఒక్కో ఉద్యోగి డీఏ బకాయిల కింద రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పొందాల్సి వుంది. జీవో 60, 61 పరిశీలిస్తే సీపీఎస్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు ప్రస్తావనలేదు. రిటైర్ అయిన ఉద్యోగులకు 2027-28లో 12 వాయిదాల్లో ఈ బకాయిలు చెల్లిస్తామని చెప్పడాన్ని ఉద్యోగ సంఘాలు నిరసిస్తున్నాయి. నాలుగు డీఏలు ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం ఒక్క డీఏ ఇచ్చి, అది కూడా (మిగతా 8వ పేజీలో)

సవరణలకు సంకేతాలు!

ఉద్యోగ సంఘాల అభ్యర్థన, డిమాండ్ల మేరకు డీఏ చెల్లింపు జీవోలు 60, 61 మార్గదర్శకాల్లో సవరణలు ఒకటి, రెండు రోజుల్లో చేయనున్నట్టు సంకేతాలు వచ్చాయి. ఆ మేరకు రెగ్యులర్, సీపీఎస్ ఉద్యోగులతోపాటు పెన్షనర్లకు కలిపి 2027-28 ఆర్థిక సంవత్సరం వరకు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా మూడు సమాన వాయిదాల్లో డీఏ బకాయిలు చెల్లించేలా సవరణ జీవోలు విడుదల కానున్నట్టు తెలిసింది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి వుంది.


ప్రభుత్వ ఉద్యోగులు (ఫైల్)

వెండి ధర తగ్గుతోంది..

నరసాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):వెండి ధర పెరిగినట్లే పెరిగి అమాంతంగా తగ్గుముఖం పడుతోంది. గత వారంలో కేజీకి రూ.25 వేలు తగ్గింది. మంగళవారం మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.1.72 లక్షల పలికింది. ఈ ధర మరింత తగ్గవచ్చన్న ఊహాగానాలు బులియన్ మార్కెట్‌లో వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో కేజీ వెండి ధర రూ.90 వేలు వద్ద స్థిరంగా ఉంది. అక్కడి నుంచి మొదలైన పెరుగుదల సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో దూసుకుపోయింది. ఒక దశలో కేజీ ధర రూ.1.98 లక్షలకు చేరింది. దీంతో రూ.2 లక్షలు దాటవచ్చన్న ఊహాగానాలు జోరందుతున్నాయి. అయితే గత గురు, శుక్రవారాల్లో డౌన్ ట్రెండ్ మొదలైంది. తగ్గుతూ వచ్చి రూ.1.72 లక్షల వద్ద నిలిచింది. ఈ వారంలో దీపావళి పండుగతో సోమవారం మార్కెట్ క్లోజ్ అయింది. మంగళవారం ఇదే పరిస్థితి. దీంతో బుధవారం మార్కెట్‌పై ఆసక్తి నెలకొంది. ఒకవేళ డౌన్ ట్రెండ్ కొనసాగితే ఎంత వరకు దిగువకు వస్తుందన్న దానిపై వేచి చూడాలి. ఇటు వెండి పెరుగుదలను చూసి జిల్లాలో చాలా మంది కస్టమర్లు కొనుగోళ్లకు పోటీ పడ్డారు. వస్తువులు కాకుండా చైనాబార్, పూసల రూపంలో ముడి వెండిని కొని దాచుకునేందుకు మక్కువ చూపారు. అయితే మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ స్టాక్ లేకపోవడంతో చాలా మంది వ్యాపారులకు అడ్వాన్సులు ఇచ్చారు. ఆ రోజు ధరకు బుక్ చేసుకున్నారు. చాలా మంది స్థోమతను బట్టి అర కేజీ నుంచి కేజీ, రెండు కేజీల చొప్పున వెండి కొనుగోళ్లకు అడ్వాన్సులు ఇచ్చారు. డెలివరి కాకుండానే ధర డౌన్ ట్రెండ్ కొనసాగుతుండంతో వీరిలో ఆందోళన నెలకొంది. 2007లో వెండి ఇదే విధంగా కేజీ రూ.30 వేల నుంచి దూసుకుపోయింది. ఒక దశలో రూ.లక్ష దాటింది. ఆ తరువాత మళ్లీ డౌన్ కర్షన్ వచ్చి మళ్లీ ఆ రేటును తాకలేదు. మళ్లీ అలాంటి పరిస్థితి బులియన్ మార్కెట్‌లో వెండికి కనిపిస్తుందా? అన్న భయం నెలకొంది. వ్యాపారులు మాత్రం తగ్గినా.. మళ్లీ పెరిగే చాన్స్ ఉంటుందని చెప్పడం కొసమెరుపు.



కేజీ రూ.1,72,000..
పాతిక వేల తగ్గుదల
మరింత డౌన్ అయ్యే చాన్స్


పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా, ఎమ్మెల్యే అంజిబాబు, ఎస్పీ నయీం, జేసీ రాహుల్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి తదితరులు

పోలీసు అమరవీరులకు నివాళులు

భీమవరం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):దేశ అంతర్గత భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణాలను ఫణంగా పెట్టిన వీర పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేం అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని మంగళవారం ఏఎంసీ ఆవరణలో నిర్వహించారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సాయుధ దళాల గౌరవ వందనం మధ్య వీర మరణం పొందిన పోలీసుల గౌరవార్థం మౌనం పాటించారు. ఏడాది కాలంలో జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన డీఎస్పీ ఎం.చక్రధరరావు, ఎస్ఐ ఏజీఎస్ మూర్తి, పీసీలు సీహెచ్.వెంకటేశ్వరరావు, పి.శ్రీహరి, టి.సురేంద్రనాథ్, పి.సునీల్‌బాబు గ్రేహౌండ్స్, కె.మహేష్‌కుమార్ గ్రేహౌండ్స్ అనే వారితో సహా ఈ ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన 191 మంది పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, జిల్లా ఏఎస్పీ వి.భీమారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అమరవీరులకు పోలీసుల నివాళి

వైద్యం వికటించి మహిళ మృతి.. బంధువుల ఆందోళన -7లో..

27 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు : జేసీ రాహుల్



భీమవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఈ నెల 27 నుంచి ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లు మొదలుకానున్నాయి. తాడేపల్లిగూడెంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్నాం' అని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసిల్దార్లు, వ్యవసాయ అధికారులతో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై మంగళవారం గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం గోనె సంచులు సిద్ధం చేయాలి. మండల స్థాయిలో రైతులు, మిల్లర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణపై అవగాహన కల్పించాలి. రైతులకు తప్ప దళారులకు ఎవరికైనా గోనె సంచులు ఇచ్చినట్లు తెలిస్తే చర్యలు తప్పవు. ధాన్యం సేకరణ సమయంలో రైతుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు చేస్తున్నాం' అని తెలిపారు. ఆక్వా సాగుకు యూరియా వినియోగించుకోకుండా తహసిల్దార్లు పర్యవేక్షించాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు, డీఎస్‌వో ఎన్.సరోజ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

శివోహం

- నేటి నుంచి కార్తీక మాసం
- ముస్తాబైన శివాలయాలు
- విద్యుత్ దీపాలతో అలంకరణ
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భక్తులకు ఏర్పాట్లు



మద్ది క్షేత్రంలో కార్తీక మహోత్సవాలు



జంగారెడ్డిగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో బుధవారం నుంచి కార్తీక మాస మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో ఈవో ఆర్‌వి.చందన ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అక్టోబరు 26, నవంబరు 2,9,16 తేదీల్లో హోమాలు, సువర్చలా హనుమద్ కల్యాణం.

అక్టోబరు 27, నవంబరు 3, 10, 17 తేదీల్లో లక్ష తమలపాకుల పూజలు.

అక్టోబరు 22, 29, నవంబరు 5, 12, 19 తేదీల్లో లక్ష పుష్పార్చనలు.

అక్టోబరు 25, నవంబరు 1, 8, 15 తేదీల్లో పంచామృత అభిషేకాలు.

నవంబరు 18న స్వామి వారి పుష్కరిణిలో విశేష తెప్పోత్సవం.

క్షీరా రామంలో కార్తీక శోభ

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. ఆలయానికి ఇరువైపులా మెయిన్‌రోడ్డులో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇంకా పెద్ద పెద్ద ద్వారాలను ఏర్పాటు చేసారు. స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

చిన వెంకన్న క్షేత్ర పాలకుడి ఆలయంలో

ద్వారకాతిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటుచేసి రంగులతో ముస్తాబు చేశారు. కార్తీక దీపాలను వెలిగించే ఉసిరి చెట్ల వద్ద పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.

యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయం

భీమవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యనమదుర్రులో శక్తీశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల భక్తులు శక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు. కార్తీక సోమవారాలలో అయితే భక్తులతో ఆలయం వద్ద క్యూ కడతారు. దిరుసుమర్రు గంగా భ్రమరాంబ రామలింగేశ్వరుడు భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలో లక్ష్మణేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణంలో కపిలమల్లేశ్వరస్వామి, అమరేశ్వర, ఏకాంబరీస్వామి, రుస్తుంబాదా ఆలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముస్తాబైన శైవ క్షేత్రాలు

మొగల్తూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివాలయాల్లో దర్శనానికి, అభిషేకాలకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి, వడయార్‌పేట వన మల్లికార్జునుడు, కొత్తపాలెం, పేరుపాలెం గ్రామాల్లో చంద్రమౌళేశ్వరస్వామి, ముత్యాలపల్లి ముక్తేశ్వరస్వామి, కాళీపట్నం కాళికేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి.



భీమవరం టౌన్/ద్వారకాతిరుమల/గణపవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. పాడ్యమి తిధి సూర్యోదయ సమయానికి ఉన్న రోజైన బుధవారం నుంచి కార్తీక స్నానాలు ఆచరించవచ్చని పండితుల మాట. నెలంతా పూజలు, ఉపవాసాలు, వ్రతాలు, వనభోజనాలు, ఆధ్యాత్మిక భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగుతాయి. వేకువజామునే చన్నీటి స్నానాలు, దీపారాధన, శివారాధనతో భక్తులు పరవశిస్తుంటారు. ఉల్లి, వెల్లుల్లి వంటి పదార్థాలు, మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. ప్రత్యేకంగా మహిళలు ఎంతో నిష్ఠగా పూజలు చేస్తారు. దీపారాధనలు, ఉపవాస దీక్షలు, కార్తీక పురాణ పఠనం చేస్తూ శివకేశవులను ఆరాధిస్తారు. కార్తీక పురాణంలో శివారాధన, దీపారాధన వైశిష్ట్యం, ఫలితాల గురించి విపులంగా ఉంటుంది. పరమశివునికి ప్రీతిపాత్రమైన కార్తీక సోమవారానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. కార్తీకమాస నెల రోజుల్లో సోమవారాలు, జ్వాలాతోరణం, శివుని ప్రాముఖ్యతను చాటితే బలిపాడ్యమి, ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి రోజుల శ్రీమహావిష్ణువును పూజిస్తారు. కార్తీక పురాణాల్లో మొదటి 15 అధ్యాయాలు శివుని, చివరి 15 అధ్యాయాలు విష్ణువు గురించి ఉంటుంది.



ముస్తాబైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం, నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం ఆలయంలో విద్యుత్ అలంకరణ

పరమ పవిత్రం కార్తీక పౌర్ణమి

కార్తీక పౌర్ణమి నాడు నదీస్నానం చేసి శివయ్యను విశేషంగా పూజిస్తారు. 365 వత్తులతో దీపారాధన చేసి ఆ పరమశివుని దర్శించుకుంటారు. పున్నమి వెలుగుల్లో కార్తీక దీపాలను వెలిగించి నదులు, పారే నీటిలో వదులుతారు. సోమవారాలు కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. కార్తీకంలో దీపారాధన ఎంతో మహిమాన్వితమైంది అని నమ్ముతారు.

ప్రత్యేక దీక్షలు.. పూజలు

కార్తీక మాసం అంటే గుర్తుచ్చే మరో అంశం... భక్తుల దీక్షలు. వివిధ దేవతామూర్తుల దీక్షలను ఈమాసంలోనే భక్తులు చేపడతారు. ఇందులో అయ్యప్ప దీక్ష, వెంకటేశ్వరదీక్ష, శివదీక్ష, వంటివి దీక్షాధారులు ఎంతో భక్తిప్రపత్తులతో స్వీకరిస్తారు. అయ్యప్ప దీక్ష కార్తీక మాసం నుంచి మకర సంక్రాంతి వరకూ అయ్యప్ప మాలధారణ చేస్తారు. వైకుంఠ ఏకాదశి నాటికి దీక్షా విరమణ చేసేలా వెంకటేశ్వరుని దీక్షలు, శివరాత్రి, కార్తీకమాస పర్వ దినాల్లో శివ దీక్షలను భక్తులు కఠిన నియమాలతో కొనసాగిస్తారు. స్వామి చింతనలో సాత్విక జీవనాన్ని పాటిస్తారు. తెల్లవారుజామునే చన్నీటి స్నానం, భజనలు, పూజలతో గడుపుతారు. పాద రక్షలు సైతం వాడకుండా కటిక నేలపై నిద్రిస్తూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. ఇవన్నీ కార్తీక మాసంలోనే ప్రారంభమవుతాయి.

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీక మాసం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. పంచారామ క్షేత్రాలైన గునుపూడి సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా క్యూలైన్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటుచేసారు. ఆచంట రామలింగేశ్వరస్వామి దేవస్థానం, నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి, జుత్తిగ ఉమా వాసుకీ రవి సోమేశ్వరస్వామి, పెనుగొండ నగరేశ్వరస్వామి, యనమదుర్రు శక్తీశ్వరస్వామి, సిద్ధాంతం, తణుకు, తాడేపల్లిగూడెం ఆలయాలు, ద్వారకాతిరుమల చిన్న వెంకన్న క్షేత్ర పాలకుడు మల్లికార్జునస్వామి, జంగారెడ్డిగూడెం మద్ది క్షేత్రం, పట్టిసీమ క్షేత్రం, తదితర శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు.



దీప దానం ప్రాముఖ్యత

కార్తీకమాసం పవిత్ర నదిలో లేదా పవిత్ర జలంలో బ్రహ్మముహూర్తంలో స్నానం చేయడం ఎంతో విశిష్టత ఉంది. మహిళలు ఉదయాన్నే స్నానమాచరించి దీపారాధన చేస్తారు. కార్తీక మాసంలో దీప దానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. పవిత్ర నది లేదా ఆలయం లేదా ఇంట్లో తులసి కోట వద్ద ప్రతీ రోజూ దీపం దానం చేయడం మంచిదని పురాణాలు చెబుతున్నాయి. జీవితంలో చీకటి తొలగి లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు.

కార్తీకంలో ముఖ్య పండుగలు

అక్టోబరు 22: కార్తీక మాస ప్రారంభం
23: యమవిదియ - భగినీ హస్త భోజనం
25: నాగుల చవితి
26: నాగ పంచమి
నవంబరు 1: కార్తీక శుద్ధ ఏకాదశి
2: క్షీరాబ్ది ద్వాదశి
5: జ్వాలా తోరణం, కార్తీక పూర్ణిమ
15: కార్తీక బహుళ ఏకాదశి
20: పోలిస్వర్గం కార్తీక మాసం ఆఖరిరోజు



నరసాపురం వలంధర్ రేవులో ఏర్పాటు చేసిన జల్లు స్నానం



సిద్ధాంతంలో కేదారేశ్వర ఘాట్



ఆచంట రామేశ్వరస్వామి ఆలయ రామగుండం

కార్తీక స్నానాలకు గోదావరి రేవులు సిద్ధం

నరసాపురం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం గోదావరిలో పుణ్యస్నానాలకు అనువుగా వలందర్ రేవు మెట్లను శుభ్రం చేశారు. ఆర్కికి విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి దుస్తులు మార్చుకునే గదులు మరమ్మతులు చేశారు. రేవులో జల్లు స్నానం సిద్ధం చేశారు. వలందర్, రాజుల్లంక, అమరేశ్వర రేవుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు.

ఆచంట(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలో ఆచంటేశ్వరుడిని ప్రతీ రోజూ వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. రామగుండం చెరువులో భక్తులు కార్తీక దీపాలు పెద్ద ఎత్తున వెలిగిస్తారు. రామగుండం చెరువును ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు శుభ్రం చేయించారు.

పెనుగొండ(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన సిద్ధాంతం కేదార్‌ఘాట్ భక్తులకు కార్తీక మాస పుణ్యస్నానాలకు సిద్ధమైంది. రెండు రోజుల నుంచి స్థానిక పంచాయతీ సర్పంచ్ చింతపల్లి గనిరాజు, దేవస్థానం అధికారి ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్నానాల రేవుల ప్రక్షాళన చేపట్టారు. రేవులలో సీసా పెంకులు, చెత్తా చెదారాలను ఒండ్రు మట్టిని పూర్తిగా తొలగించారు. నడిపూడిలో కూడా గోదావరి పుష్కర రేవు, మండలంలోని పలు ఆలయాల పుష్కరిణులు శుభ్రం చేశారు.

అంబేడ్కర్ వర్సిటీకి భవనం చూపండి

- వారంలో తాత్కాలిక కార్యాలయం
- జనవరిలో విద్యార్థుల ప్రవేశానికి చర్యలు
- నేడు కలెక్టర్‌తో ఇన్‌చార్జి వీసీ సమావేశం

ఏలూరు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలో ఏర్పాటు కానున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీకి భవనం కేటాయింపుపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కరరావు బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వితో సమావేశం కానున్నారు. కలెక్టర్ అనుమతి లభించినట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. విశ్వవిద్యాలయాన్ని తొలుత ప్రభుత్వ భవనంలో ప్రారంభించేందుకు వీలుగా అందుబాటులో తగిన భవనాలు చూపాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే లేఖ పంపారు. వారం రోజుల్లో యూనివర్సిటీ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించడానికి అధికారులు సమాయత్తం అయ్యారు. ఆఫీసు భవనం ఖరారైన వెంటనే ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయ కార్యకలాపాలను నిర్వహించనున్నారు. కొత్తగా భవనాలను నిర్మించేందుకుకూడా ప్రభుత్వ భూములకోసం అభ్యర్థించారు. మరోవైపు డిగ్రీ, పీజీ కోర్సులకు వచ్చే జనవరి నుంచి ప్రవేశాలు చేపట్టాలని అధికారికంగా నిర్ణయించారు. రాష్ట్రంలో యూనివర్సిటీకి 72 రీజినల్ సెంటర్లలో పనిచేసే సిబ్బందికి గత 10 నెలలుగా జీతాలు చెల్లించకపోవడాన్ని గుర్తించిన అధికారులు తొలి ప్రాధామ్యాల్లో భాగంగా సిబ్బంది జీతాలబకాయిలను చెల్లించేందుకు నిర్ణయించారు.

సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో..?

తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకోసం గన్నవరం ఎయిర్‌పోర్టుకు సమీపంలో ప్రభుత్వ భవనాలు అందుబాటులోవున్న విషయాన్ని యూనివర్సిటీ అధికారులు ఇప్పటికే గుర్తించగా, ఆ ప్రాంతం ఏలూరు జిల్లాకు చెందినది కాకపోవడంతో పునఃపరిశీలనలో ఉంచారు. ప్రస్తుతం జిల్లాకు సంబంధించి యూనివర్సిటీకి ఏలూరు సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో రీజినల్ సెంటర్‌ను ఆధునికీకరించి, అందులోనే తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారన్న ఓ ప్రచారం ఉంది. వట్లూరులో గతంలో ఏపీ నిట్ ఏర్పాటుకు ప్రతిపాదించి, విరమించుకున్న ప్రభుత్వ భూముల్లో విశ్వవిద్యాలయ భవనాలను నిర్మిస్తే జాతీయ రహదారికి చేరువగా ఉంటాయని, అలాగే గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాల ప్రాంగణానికిచేరువగావున్న 6.50 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూముల్లోకూడా యూనివర్సిటీ శాశ్వత భవనాలను నిర్మించడానికి నేషనల్ హైవే సమీపంలోనే ఉంటుందని మరికొన్ని ప్రతిపాదనలున్నాయి. ఈ అంశాలపై బుధవారం కలెక్టర్‌తో చర్చించనున్నారు.



స్కేటింగ్ రింక్‌లో ఉత్సాహంగా తలపడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా స్కేటింగ్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్స్ గేమ్స్ జూడో, స్కేటింగ్ ఎంపిక పోటీలు మంగళవారం ఏలూరు ఇండోర్ స్టేడియం వేదికగా జరిగాయి. ఇటీవల మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర పోటీలకు ఎంపిక కావాలనే లక్ష్యంతో క్రీడాకారులు తమ శక్తియుక్తులను ప్రదర్శించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ పద్మలత తెలిపారు. స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో అండర్ 14 నుంచి 17 విభాగాల విద్యార్థులకు స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. పీడీలు రవిబాబు, కృష్ణ వెంకటేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు.

కొత్త అల్లుడికి అదిరిపోయే ఆతిథ్యం

వీరవాసరం (భీమవరం టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్త అల్లుడికి అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వడంలో గోదావరి జిల్లా అత్తింటివారు ముందుంటారు. కొత్త అల్లుడికి ఈ మర్యాదలు ఎక్కువగా సంక్రాంతి పండగకు ప్రత్యేక విందు ఇస్తారు. ఇప్పుడు దీపావళికి కూడా విందులతో అదరగొడుతున్నారు. అల్లుడికి విందు అంటే ఒకటో, రెండో రకాలతో కాదు దాదాపు 200 రకాలతో విందు భోజనం పెట్టి అల్లుడికి దీపావళి స్పెషల్‌ను అందించారు. వీరవాసరం మండలం పంజా వేమవరం గ్రామానికి చెందిన మళ్లా తులసీ రాంబాబు కుమార్తె గోవర్ధినికి విశాఖపట్నంకు చెందిన రాహుల్‌తో ఈ నెల 11న వివిశాఖపట్నంలో వివాహం చేశారు. పెళ్లి అయిన 10 రోజులకే దీపావళి పండుగ రావడంతో రాహుల్ అత్తింటికి వచ్చారు. రాహుల్‌కు 200 రకాల నాన్‌వెజ్, వెజిటేరియన్ వంటకాలతో కమ్మనైన విందు భోజనం రూచి చూపించారు. అల్లుడికి స్వయంగా మా మ రాంబాబు వడ్డించారు. దీంతో అల్లుడు అత్తింటివారి మర్యాదలకు, విందుకు ఫిదా అయిపోయిడు. ఇలాంటి మర్యాదను తాను ఎప్పుడూ చూడలేదంటూ మామ రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని అల్లుడు, కుతూరుని ఇంటికి తీసుకువచ్చామని, కొత్త అల్లుడిని సర్‌ప్రైజ్ చేయాలనే ఉద్దేశంతో 200 రకాలను దగ్గరుండి తయారు చేయించానని ఆనందంతో తెలిపారు.



అల్లుడికి పిండి వంటలు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు

పెంటపాడు విద్యార్థులు

3ఎఫ్ ఇండస్ట్రీస్ రూ.2 లక్షల ఆర్థిక ప్రోత్సాహం

పెంటపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికయ్యారు. కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న కాశిరెడ్డి కావ్య, ఎ.శివసత్య ఎన్‌సీసీ క్యాడెట్స్. కావ్య గత జనవరిలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొంది. రానున్న జనవరిలో జరిగే వేడుకలకు కూడా ఎంపికైంది. కళాశాల ప్రాంగణంలో కళశాల వ్యవస్థాపకుడు బాలకృష్ణ గోయెంకా విగ్రహ ప్రతిష్ఠకు వచ్చిన ఫుడ్‌ప్యాట్ సంస్థ ఎండీ ఓపి గోయెంకా, డైరెక్టర్లు సుశీల్, సీమాకు ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు 3ఎఫ్ ఇండస్ట్రీస్, ఫౌండేషన్ తరఫున విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకం ప్రకటించారు

భవిష్యత్‌లో పీజీ చేస్తా



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. గత జనవరిలో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలలో సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నాను. వచ్చే జనవరిలో జరిగే పరేడ్‌కు కూడా ఎంపికయ్యాను. 3ఎఫ్ ఇండస్ట్రీస్ వారు ఉన్నత చదువులకు ప్రోత్సాహం ప్రకటించడం ఆనందం కలిగించింది. భవిష్యత్‌లో పీజీ చేస్తాను.

- కాశిరెడ్డి కావ్య, బీఎస్సీ జువాలజీ, పెంటపాడు

ఆర్మీలో చేరడమే లక్ష్యం



నాకు డిఫెన్స్ అంటే చాలా ఇష్టం. ఆర్మీ లక్ష్యంగా ఎన్‌సీసీలో చేరాను. ఇటీవల కాకినాడలో జరిగిన ఇంటర్ గ్రూప్ పోటీల నుంచి ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికయ్యాను. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ కోచ్ ప్రేమసాగర్ ఎంతో తోడ్పాటు అందించారు. త్రీ ఎఫ్ ఇండస్ట్రీస్ ప్రోత్సాహానికి కృతజ్ఞతలు.

- ఎ.శివసత్య, బీకాం, పిప్పర

వైద్యం వికటించి మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యం కారణమని బంధువుల ధర్నా

నూజివీడు టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన బాలింత ప్రత్తిపాటి ఉషారాణి (28) మృతి చెందింది. ప్రసవం కోసం ఆదివారం నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఉషారాణి చేరి పండంటి మగబిడ్డను ప్రసవించింది. కొద్దిసేపటికే పరిస్థితి విషమంగా మారడంతో వైద్య పరీక్షలు చేసిన నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యులు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని సూచించారు. రక్తం ఎక్కిస్తున్న క్రమంలో ఉషారాణి పరిస్థితి మరింత విషమించడంతో విజయవాడ జీజీహెచ్‌కు నూజివీడు వైద్యులు సోమవారం రిఫర్ చేశారు. విజయవాడకు తరలిస్తుండగా ఆమె మృతి చెందినట్లు జీజీహెచ్ వైద్యులు నిర్ధారించారు.



ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు (ఇన్‌సెట్) ఉషారాణి మృతదేహం

బంధువుల ధర్నా

నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఉషారాణి మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. రక్తం ఎక్కించిన తరువాతే ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైందని, ఆ సమయంలో వైద్యులు ఆమెను పట్టించుకోలేదని భర్త బాలయ్య, బంధువులు ఆరోపించారు. ఏరియా ఆసుపత్రి వద్ద ఉషారాణి బంధువులతో కలిసి సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ తదితరులు ధర్నా చేపట్టారు. బాలింత మృతిపై సమగ్ర విచారణ జరిపి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో నూజివీడు ఏరియా ఆసుపత్రి వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ బాధిత కుటుంబసభ్యులతో చర్చించడంతో బాధితులు ఆందోళనను విరమించారు.

బిడ్డను చూడకుండానే..

మగబిడ్డ కావాలని ఆశపడిన బాలయ్య, ఉషారాణి దంపతులకు ఆశ నెరవేరింది. బిడ్డను కళ్లారా చూడకుండానే తల్లి మృతి చెందడంతో పోతురెడ్డిపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. పదేళ్ల క్రితం వారికి వివాహం కాగా వరుసగా ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. మగబిడ్డ కావాలనే ఆశతో ఉన్న దంపతులకు మరో రెండు కాన్పులు జరిగినా ఆ బిడ్డలు నిలువలేదు. చివరికి ఆదివారం ఉషారాణి పండంటి మగబిడ్డకు జన్మినిచ్చి తుదిశ్వాస విడిచింది. 'మరోవైపు తమ్ముడు పుట్టాడు కాని అమ్మను ఎందుకు బాక్స్‌లో పెట్టారు? అమ్మ ఎందుకు లేవడం లేదు? తమ్ముడు పుట్టగానే అమ్మ మాకు చూపిస్తానంది. అమ్మను లేపండి' అంటూ ఉషారాణి కుమార్తెలు ఏరియా ఆసుపత్రిలో రోదిస్తున్న తీరు చూపరులను సైతం కన్నీరు పెట్టించింది.

కాగా ఉషారాణి దంపతులు మగపిల్లాడు కావాలనే కోరిక, వరుస ప్రసవాల నేపథ్యం, బాలింతకు రక్తంలో హిమోగ్లోబిన్ బాగా పడిపోయిందని వైద్యులు చెబుతున్నారు. రక్తం ఎక్కించే క్రమంలో సైడ్ ఎఫెక్ట్ రావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఏరియా ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

23, 24 తేదీల్లో క్రీడా ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్జీఎఫ్ కార్యదర్శి అలివేలు మంగ మంగళవారం తెలిపారు. వాలీబాల్ క్రీడా ఎంపికలు ఈ నెల 23న కొవ్వూరు ఎన్టీఆర్ స్టేడియం, 24న ఫుట్‌బాల్ క్రీడా ఎంపికలు దేవరపల్లి జడ్పీ హైస్కూలులో జరుగుతాయని వివరించారు. క్రీడాకారులు తాము చదువుతున్న స్కూలు హెచ్‌ఎం లేదా ప్రిన్సిపాల్ సంతకం చేసిన జిల్లా స్థాయి ఎంట్రీఫాం అందజేయాలని సూచించారు. క్రీడాదుస్తులు, వాటర్ బాటిల్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 90308 94311లో సంప్రదించాలని కోరారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఒకరి మృతి

టి.నరసాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మోటర్ సైకిల్ ఢీకొని ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏపిగుంట పంచాయతీ లింగమ్మగూడెం గ్రామానికి చెందిన కుంజా సోమరాజు (49) టి.నరసాపురం గ్రామానికి చెందిన అలగాని వెంకటేశ్వరరావుకు కొబ్బరికాయలు కోయడానికి వెళుతున్నాడు. మంగళవారం ఉదయం మోటార్ సైకిల్‌పై వెళుతుండగా గుర్వాయిగూడెం శివారు మలుపు వద్ద మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పాకా బలరామ్ మోటార్‌సైకిల్‌పై అతివేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సోమరాజు తలపై తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి తలకు బలమైన దెబ్బతగలడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య కుంజా దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

లారీని వెనక నుంచి ఢీకొన్న మరో లారీ

డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకుండా లారీని నిలిపి ఉంచడంతో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఢీకొన్న లారీ డ్రైవర్ మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం లింగపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సుర్ల రాజు (36) లోడుతో హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఒక లారీ ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ దుగ్గిరాల వద్ద ఆగి ఉంది. ఆ లారీ ముందు వెళుతుందని భావించిన రాజు నడుపుతున్న లారీ వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రాజును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె

తణుకు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి లో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలిని కోరుతూ మంగళవారం విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. మూడు నెలలు వేతన బకాయిలు చెల్లించాలని, 14నెలల పీఎఫ్ బకాయిలు కార్మికులు ఖాతాల్లో జమచేయాలని, 150పడకల ఆసుపత్రి స్థాయికి తగ్గట్టుగా కార్మికులను పెంచాలని డిమాండ్‌లతో సమ్మెలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు సమ్మెకు మద్దతు తెలిపారు.

అమరవీరుల సంస్మరణ ర్యాలీ

ఆచంట, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాన్ని మంగళవారం ఆచంటలో పోలీసులు నిర్వహించారు. ముందుగా పోలీసు అమరవీరులకు ఎస్‌ఐ కట్టా వెంకట రమణ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ పురవీధుల గుండా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకట రమణతో పాటు స్థానిక పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో గ్రామ దేవతలపై సినిమా తీస్తా

ఆకివీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సినీ పరిశ్రమ పరిస్థితి బాగోలేదని నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పెద్దింట్లమ్మను దర్శించుకున్న ఆయన దేవస్థానం చైర్మన్ గొంట్లా గణపతి, ఈవో అల్లూరి సత్యనారాయణరాజు సన్మానించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి మాట్లాడుతూ సినీ పరిశ్రమ సక్రమంగా లేకపోయినా సినిమాలు తీయడం జరుగుతుందన్నారు. గతంలో సినిమాలు తీస్తే వందల రోజులు ఆడేవని, నేడు వారం రోజులు ఆడడం గగనం అయిపోతుందన్నారు. టీవీలు, ఓటీడీలు అధికంగా ఉండడంతో సినిమాలు ఎ వరూ థియేటర్లలో చూడకపోవడంతో ఎక్కువ రోజులు ఆడడం లేదన్నారు. దీంతో నిర్మాతలతో పాటు మిగిలిన వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. త్వరలో ఆకివీడు పెద్దింట్లమ్మ, భీమవరం మావుళ్లమ్మ తదితర దేవతల సినిమా తీస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, టీడీపీ సీనియర్ నాయకుడు కిమిడి నాగరాజు ఉన్నారు.

కొత్త ఉపాధ్యాయులతో యూటీఎఫ్ సభ్యత్వాలు

ఆకివీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు బలోపేతం చేయాలని యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ విక్రమ్ అన్నారు. డీఎస్సీ 2025లో ఎంపిక కాబడి ఈ నెల 13 నుంచి విధుల్లో చేరిన ఉపాధ్యాయులను మంగళవారం యూటీఎఫ్ నేతలు కలిసి డైరీ, బుక్, పెన్ను, కరపత్రం అందచేసి సభ్యత్వం తీసుకున్నారు.

క్రీడల్లో జడ్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మొగల్తూరు. అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):ఇటీవల తణుకులో నిర్వహించిన డివిజన్‌స్థాయి క్రీడా పోటీల్లో మొగల్తూరు పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ తెలిపారు. అండర్ 17 విభాగంలో రన్నింగ్ 800 మీటర్ల పరుగు పందెంలో నంగనం శ్రీవిద్య, మూటూరి అంజలి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో షేక్ చాందిని ప్రథమ స్థానం సాధించిందన్నారు.

కాళ్ల టీడీపీ అధ్యక్షుడుగా ఆరేటి


ఆరేటిని సత్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, భరత్

కాళ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కాళ్ల మండలాధ్యక్షుడుగా దొడ్డనపూడి గ్రామానికి చెందిన ఆరేటి వెంకటరత్న ప్రసాద్ (తాతాపండు) నియమితులయ్యారు. ఆయన గతంలో సర్పంచ్‌గా, ఎంపీపీగా ప్రజలకు సేవలందించారు. ఆయన నియమకాన్ని మంగళవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తనయుడు భరత్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కార్యదర్శి సత్య ఉషారాణి

తణుకు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజనుల సర్వీసులు శాఖ, నెటివెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌కేఎస్‌డీ కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి చెప్పా రు. ఫోక్ సాంగ్‌లో శర్వాణి అండ్ గ్రూపు ప్రథమ, కూచిపూడి క్లాసికల్‌లో కె. ఖ్యాతీశ్వరి, ప్రథమ, వక్తృత్వంలో పి.ఎన్.డి. లక్ష్మి, ప్రథమ, డ్రాయింగ్‌లో కె. మహేశ్వరి ప్రథమ, వ్యాసరచనలో కె. యశస్వి ప్రథమ, ఫోక్ డాన్సులో శర్వాణి అండ్ గ్రూపు ద్వితీయ, ఫోక్ డాన్సు సోలోలో కె. ఖ్యాతీశ్వరి ద్వితీ య, ఫోక్ సాంగ్‌లో పి.చరిత ద్వితీయ, వ్యాసరచనలో పి.చిన్ని తృతీయ, పెయింటింగ్‌లో తహసిన ప్రోత్సాహక బహుమతులు సాధించినట్టు తెలిపారు.

సోగ్గాడు 50 వసంతాల పండుగ చేయండి

భీమవరం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):సురేష్ సంస్థల అధినేత నిర్మాత దగ్గుపాటి సురేశ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో అఖిల భారత శోభన్ బాబు సేవాసమితి సభ్యులు కలుసుకున్నారు. డిసెంబర్ 19వ తేదీన నాటికి శోభన్ బాబు నటించిన సోగ్గాడు చిత్రం 50 వసంతాలు పూర్తి చేసుకుంటుందని, 50 వసంతాల ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.

సమాచారం

నేడు తణుకు మండల సమావేశం

తణుకు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):ఈనెల 22వ తేదీన తణుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈసమా వేశానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది, హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

పాలకోడేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలంలో 5-7 సంవత్సరాల చిన్న పిల్లలకు స్పెషల్ మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ శిబిరాలు ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోగల్లు -2, వేంద్ర, విస్సాకోడేరు-1, గరగపర్రు, శృంగవృక్షం -1లలో గ్రామ సచివాలయాల వద్ద జరుగుతాయని తెలిపారు.

24న తాడేపల్లిగూడెం మండల సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎమ్మెల్సీలు హాజరవుతారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, హాజరుకావాలని కోరారు.

రేపు ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పీవీఎస్ గ్రూప్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, జగదీష్ మెరైన్, సూర్యమిత్ర ఎగ్జిమ్ వంటి కంపెనీలలో భీమవరం లోకేషన్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18-35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ కింది లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 8688594244 (శ్రీనివాస్), 9440838388 (రాధిక) నెంబర్లలో సంప్రదించాలన్నారు. లింక్ : నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్/యూజర్-రిజిస్ట్రేషన్.

26న ఏఎంసీ ప్రమాణ స్వీకారం

నరసాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీలో కష్టించి పని చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. 26న అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో జరిగే ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గంలోని పార్టీశ్రేణులు పెద్ద సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆనందోత్సాహాలతో వెలుగుల దీపావళి


భీమవరంలో హాస్టల్‌లో విద్యార్థినులతో కలిసి జేసీ రాహుల్ కుమార్ రెడ్డి దీపావళి పండుగ.. తాడేపల్లిగూడెంలో బాలలకు స్వీట్లు పంచుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం పట్టణంలోని కొండయ్య చెరువు సమీపంలో ఉన్న లైఫ్‌ఆఫ్ లార్డు అనాథ శరణాలయంలో చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దీపావళి వేడుకలు జరుపుకున్నారు. అనాథ పిల్లలకు క్రాకర్స్ మతాబులు, స్వీట్లు అందజేశారు. ఆయన వెంట జనసేన నాయకులు నీలపాల దినేష్, అడబాల రామారావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: భీమవరం రైతు బజార్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, కుటుంబ సభ్యులు దీపావళి వేడుకలను జరుపుకున్నారు. బాణసంచా, స్వీట్లు విద్యార్థినులకు పంచారు. బాలికలతో కలిసి బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా వసతి గృహంలో సౌకర్యాలు ఎలా ఉంటు న్నాయి, భోజనం, వసతి, టాయిలెట్స్ ఇతర ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

దీపావళి పండుగ అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని, కష్టాలనే చీకట్లు తొలగి వెలుగులు నిండిపోవాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో త్యాగ రాజ భవనంలో దీపావళి వేడుకలను నిర్వహించారు. క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్ గుప్తా, కనగర్ల రామకృష్ణ, కొత్త శ్రీ నివాస్ కారుమూరి సత్యనారాయణ, కోట్ల నాని మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ప్రతి గడపలో ఆనందం వెల్లివిరియాలని అన్నారు. అనంతరం కొత్త శ్రీను పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

పాలకోడేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధించిన సుంకాల వల్ల భారత రైతాంగం తీవ్రంగా నష్టపోతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపరేమిటని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బి. బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా సోమవారం మోగల్లు గ్రామంలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలో వ్యవసాయం, పాడిపరిశ్రమ, ఆక్వా, ఫార్మా రంగం, ట్రాక్టర్లు, ఆటోమొబైల్ రంగం, టెక్స్‌టైల్స్ వంటి రంగాలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. తక్షణం ఈ సుంకాలను ట్రంప్ రద్దు చేసేలా కేంద్రం ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రాం, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రియ్య పాల్గొన్నారు.

పెంటపాడు:ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, బంకూరు నాగే శ్వరరావు అన్నారు. సుంకాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పెంటపాడు గేటు సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు.

తణుకు రూరల్:వేల్పూరు గ్రామంలో ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు.జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, మండల కమిటీ సభ్యులు విశ్వనాథం సుబ్బారావు, నాయకులు వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేం ద్ర పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో ట్రంపు దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, నాయకులు పిల గాదినాయుడు, గజ్జరపు వెంకటేశ్వరరావు, పిల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి


డీఆర్‌జీ కాలేజ్ లో వ్యవస్థాపకుడు బాలకృష్ణ గోయింకా విగ్రహాన్ని ఆవిష్కరించిన సంస్థ ఎండీ

పెంటపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించాలని 3ఎఫ్ ఇండస్ట్రీస్ ఎండీ ఓపీ గోయింకా అన్నారు. మంగళవారం పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుడు బాలకృష్ణ గోయింకా విగ్రహాన్ని ఎండీ ఓపి గోయింకా, డైరెక్టర్లు సుశీల్ గోయింకా, సీమా గోయింకా, ప్రణవ్ గోయింకా, అఖిల గోయింకా ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం ఢిల్లీ రిపబ్లిక్ వేడుకలకు ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థులు ఎ.శివసత్య, కాసిరెడ్డి కావ్య లకు ఉన్నత చదువుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు సాయాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ జనార్దన్, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ వేముల శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

కరువు భత్యం జీవోలపై ఉద్యోగుల కన్నెర్ర!

(5వ పేజీ తరువాయి)

చెల్లింపు విషయంలో గందరగోళానికి గురిచేయడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను మోసం చేయడమేనని సంఘాలు విమర్శిస్తున్నాయి.

జీవోలు 60, 61లను సవరించాలి

వి.రవికుమార్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం డీఏ బకాయిల చెల్లింపు విషయంలో దాటవేత ధోరణిని ప్రదర్శిస్తోంది. 21 నెలల బకాయిలు రిటైర్‌మెంట్ నాడు చెల్లిస్తామని జీవోలో పేర్కొనడం దారుణం. 20 ఏళ్ల తర్వాత రిటైరయ్యే ఉద్యోగికి ఈ బకాయిల సొమ్ముకు వడ్డీ గాని, అవసరాలకు డబ్బును వాడుకొనే అవకాశం ఉండదు. తక్షణం జీవోలు 60, 61లను సవరించాలి.

రిటైర్‌మెంట్‌తో ఇస్తామనడం సరికాదు

షేక్ రంగావళి, రాష్ట్ర కార్యదర్శి, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం

డీఏ బకాయిలు చెల్లింపుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అనుసరించిన తీరు బాధాకరం. 21 నెలల డీఏ బకాయిలు రిటైర్‌మెంట్‌తోపాటు ఇస్తామనడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదు. సీపీఎస్ వారి ప్రస్తావన తేకపోవడం దారుణం.

సవరణకు డిమాండ్

డీఏ బకాయిలను రిటైరైన తర్వాత చెల్లిస్తామని షరతు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఇప్పటికే ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు 2027-28 ఆర్థిక సంవత్సరంలో బకాయిలను 12 విడతల్లో చెల్లిస్తామని మెలిక పెట్టడాన్ని ఖండిస్తున్నట్టు ఏపీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వైదేముడు తెలిపారు.

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి నాలుగు విడతల డీఏల చెల్లింపు గురించి ఎదురుచూస్తున్న సమయంలో ఒకేఒక్క డీఏను దీపావళి సందర్భంగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించి, అదికూడా ఎరియర్స్ చెల్లింపు విషయంలో ఉద్యోగి రిటైరైన తర్వాత లేదా మరణించిన తర్వాత చెల్లిస్తామనడం విడ్డూరంగా ఉందని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఆక్షేపించారు.
- ప్రస్తుత అవసరాలకు ఇవ్వాల్సిన డీఏను రిటైర్మెంట్ తర్వాత లేదా మరణానంతరం ఇస్తామనడం అన్యాయ మని ఏపీటీఎఫ్-1938 నాయకులు జి.కృష్ణ, రామ్మోహన్, మోహన్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులకువున్న నమ్మకాన్ని వమ్ముచేస్తూ నాలుగు డీఏలకు కేవలం ఒక డీఏను ప్రకటించి నిరాశకు గురిచేశారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డి దొర ఆరోపించారు.
- సంప్రదాయానికి విరుద్ధంగా ఉన్న కరువు భత్యం జీవోలు 60, 61 వెంటనే సవరించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (అప్టా) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శివరామ్, ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- డీఏలకు సంబంధించి విడుదల చేసిన 60, 61 జీవోలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఇచ్చారా ? లేదా ? అధికారులు స్పష్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. రెండు జీవోల విడుదలపై సవరణ చేయాలని వారు డిమాండ్ చేశారు.

మల్లవరం సొసైటీ చైర్మన్‌గా నర్సింహారావు

నరసాపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మల్లవరం సొసైటీ చైర్మన్‌గా సంది నర్సింహారావును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. సభ్యులుగా కవురు విష్ణుమూర్తి, పులఖండం వెంకట నర్సింహారావుగా నియమితులయ్యారు. దీంతో మండలంలోని అన్ని సొసైటీలకు పాలకవర్గాన్ని నియమించినట్లయింది.

రాష్ట్రస్థాయి పోటీలకు మండపాక విద్యార్థులు

తణుకు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 22, 23 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన వి.సుష్మ, ఎం.సత్యశ్రీ, బి. దుర్గా ప్రసాద్, వి.నాగదుర్గ, ఎ.అనిల్, ఎస్.కృష్ణ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీన ఏలూరులో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు తెలిపారు.

సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుక

నరసాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రెబల్‌స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకల్ని అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎన్ కాలేజీ గేట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను విప్ నాయకర్ కట్ చేశారు. అనంతరం అభిమానులతో కలిసి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫెక్సీలు చేతబట్టి ర్యాలీ చేశారు.

కలప, ట్రాక్టర్ సీజ్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుమామిడి నుంచి పట్టింపాలెంకు టేకు కలప అక్రమంగా ట్రాక్టర్‌పై తరలిస్తున్నట్టు అటవీశాఖ జిల్లా అధికారి డీఏ కిరణ్‌కు వచ్చిన సమాచారంతో భీమవరం రేంజ్ అటవిక్షేత్ర అధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో పట్టింపాలెంలోని పామాయిల్ తోటలో స్వాధీనం చేసుకున్నారు. కలప విలువ లక్ష రూపాయలు ఉన్నట్టు నిర్ధారించారు. కలపతోపాటు లభించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు వివరించారు.

తేతలిలో ఇరువర్గాలపై కేసు

తణుకు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):తేతలి గ్రామంలో సోమవారం రాత్రి రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం రాత్రి తేతలి గ్రామంలో ఇరువర్గాలు దీపావళి టపాసులు మీద పడ్డాయంటూ ఘర్షణకు దిగారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి, ఇరువైపుల 8 మందిపై కేసు నమోదు చేశారు. అల్లర్లు జరగకుండా మంగళవారం పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.

కేబుల్ వైర్ల దొంగలు దొరికారు

మొగల్తూరు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు పంచాయతీ పరిధి యూనియన్ బ్యాంకు సమీపంలో ప్రధాన రహదారి వెంబడి గల వివిధ నెట్‌వర్క్ కంపెనీలకు సంబంధించిన కేబుల్ వైర్లు గత బుధవారం అర్ధరాత్రి సమయంలో భూమిని తవ్వి అందులో వైర్లను దొంగలు తవ్వుకుపోయిన విషయం పాఠకులకు విదితమే. తాడేపల్లిగూడెం, నిడదవోలుకు చెందిన వ్యక్తులు కేబుల్ వైర్లు దొంగతనాలకు పాల్పడుతున్నట్టు సిబ్బంది గుర్తించి వారి సమాచారాన్ని బిఎస్ఎన్ఎల్ అధికారుల ద్వారా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

కానిస్టేబుల్‌పై దాడి

భీమవరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జంపా శ్రీరామ వెంకట దుర్గాప్రసాద్ ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి కొత్త బస్టాండ్ దగ్గర విధులు నిర్వహిస్తుండగా అక్కడ కొంత మంది మద్యం సేవిస్తున్నారు. వారిని వెళ్ళిపోమని చెప్పగా వారందరూ కలిసి దుర్గాప్రసాద్‌పై దాడి చేసి సెల్‌ఫోన్ ధ్వంసం చేశారు. అనుమానితులుగా చందు, రాకేష్ (సాయి), నజీర్, మరికొంత మంది ఉన్నట్లుగా నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కార్యాలయంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య సేలందించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు బి.పి, షుగర్ పరీక్షలు 36మందికి చేసి రిపోర్టులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

గాలి.. వాన.. చలి

(5వ పేజీ తరువాయి)

వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే వేటకు వెళ్లిన బోట్లన్నీ తీరానికి చేరుకున్నాయి. వర్షాలకు రోడ్లు, పంట పొలాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి రాకపో కలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చల్లటి గాలులకు ప్రజలు ఇళ్లకే పరిమితయ్యారు. వర్షం, గాలులతో తీర ప్రాంతం నుంచి పట్టణానికి వచ్చే వాహనాల సంఖ్య తగ్గింది. మొగల్తూరు మండలంలో ఈ నెల 19న 25.4, 20న 22.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై గల గోతుల్లో వర్షం నీరు నిలిచి ప్రయాణీకులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాలకు మండలంలో సాగు చేసిన కొద్దిపాటి సార్వా చేలు మునిగాయి. చేలల్లోని ముంపు డ్రైన్‌ల నుంచి లాగకపోవడంతో రైతులు ప్రత్యేక ఇంజ న్లు వేసి ముంపు నీటిని బయటకు తోడుతున్నారు. మెరక తోటల్లో సాగు చేసిన వంగ, బెండ, దొండ, ఆనప, బీర, కాకరపాదులు ఇవకబారిన పడి కుళ్లిపోతున్నట్టు రైతులు పేర్కొన్నారు.

గౌరిదేవి ఉత్సవాలు ప్రారంభం


తోడు గౌరమ్మను తీసుకువస్తున్న గ్రామస్థులు

పెంటపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగే గౌరీ దేవి అమ్మవారి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ శివారు నుంచి మేళతాళాలు, గరగ నృత్యాల నడుమ తోడు గౌరిదేవి అమ్మవారిని తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. వచ్చే నెల 5వ తేదీ వరకు నిత్య హోమాలతో పాటు, ప్రతి రోజు ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. వచ్చే నెల 6వ తేదీన అమ్మవారికి భారీ ఊరేగింపు, 11 వ తేదీన భారీ అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపక దినోత్సవం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):స్థానిక వీవర్స్ కాలనీలోని మునిసిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో అజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం ఆర్‌భవానీ ప్రసాద్ మాట్లాడుతూ 1943 అక్టోబర్ 21వ తేదీన నేతాజీ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అజాద్ హింద్ ఫౌజ్ సంస్థను నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో నేతాజీకి, జాతీయ పతాకానికి వందనం చేశారు.

చంద్రబాబును కలిసిన త్రిమూర్తులు


చంద్రబాబుతో మాట్లాడుతున్న గంటా త్రిమూర్తులు

భీమవరం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్టమొదటి సారిగా గంటా త్రిమూర్తులు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్ర బాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సేవల విస్తరణ దిశగా మరింత ఉత్సాహంగా, సమష్టిగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు. అనంతరం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశారు.

ట్రైసైకిల్స్ అందజేత

భీమవరం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4లో భాగంగా ఇద్దరు దివ్యాంగులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా ట్రైసైకిల్స్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, యర్రంశెట్టి శివకృష్ణ, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, మాజీ కౌన్సిలర్ ఎండి నౌషద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తాం


గణపవరం బస్టాండ్‌లో తాగునీటి కుళాయిని పరిశీలిస్తున్న తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దానమ్మ

గణపవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు పూర్తిస్థాయిలో తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దానమ్మ తెలిపారు. గణపవరం బస్టాండ్‌లో సమస్యలను మంగళ వారం ఆమె పరిశీలించారు. బస్టాండ్‌ను ఆధునీకరించి, రంగులు వేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని తాడేపల్లి గూడెం ఆర్టీసీ బస్టాండ్ నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే అరుణాచలం గిరి ప్రదర్శనకు, తూర్పుగోదావరి జిల్లాలోని పలు క్షేత్రాలకు ఈ కార్తీకమాసంలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇండియాకు రప్పించడానికి ఎమ్మెల్యే సాయం

తాడేపల్లిగూడెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారాంపేటకు చెందిన మన్నే ఆదిలక్ష్మి కొంతకాలంగా మస్కట్‌లో కూలిపని చేస్తూ ఉండేది. ఇటీవల ఆదిలక్ష్మి ఆరోగ్యం క్షీణించడంతో ఆ విషయాన్ని తాడేపల్లిగూడెంలో ఉండే తల్లికి తెలిపింది. తల్లి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో ఎమ్మెల్యే బొలిశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మస్కట్‌లో ఉన్న తన మిత్రులకు తెలియజేశారు. ఆదిలక్ష్మి ఇండియాకు రావడానికి అయ్యే విమాన టికెట్ తీసి తీసుకొచ్చారు. తాడేపల్లిగూడెం వచ్చిన ఆదిలక్ష్మి మంగళవారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసింది.